క్లుప్తంగా

వెల్లటూరులో ఏకలవ్యుని విగ్రహ ప్రతిష్ఠ



వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో కాల్వ వంతెన వద్ద సోమవారం 10 అడుగుల ఏకలవ్య విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ విగ్రహాన్ని కొల్లూరు మండలం జువ్వలపాలేనికి చెందిన వేములపల్లి రవికిరణ్ అందించారు. ఇందుకు బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, వెల్లటూరుకు చెందిన కాట్రగడ్డ గోపాల్, మోటూరు పుల్యా శ్రీనివాసరావు, మరి కొంత మంది సహాయ సహకారాలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్డు వెంకటేశ్వరరావు, ఊసరపు వెంకటేశ్వర్లు, కట్టా శ్రీనివాసరావు, బొడ్డు అంజనేయులు, కట్టా పిచ్చయ్య, బొడ్డు శ్రీను, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనపై అవగాహన



భట్టిప్రోలు: స్థానిక ఆర్బీకేలో సామూహిక ఎలుకల నిర్మూలనపై సోమవారం వీఏఏలు, వీహెచ్ఏలకు అవగాహన సదస్సు జరిగింది. బాపట్ల జిల్లా కేంద్రం నుంచి డీఆర్‌సీ డీటీ విభాగానికి చెందిన ఏవో ఆర్.విజయ్‌బాబు ఎలుకల నిర్మూలనపై శిక్షణ ఇచ్చారు. సూరేపల్లి, భట్టిప్రోలు ఆర్బీకేల్లో గోదాములలో ఎరువులను తనిఖీ చేసి, స్టాక్ వివరాలు, రిజిష్టర్లను పరిశీలించారు. వ్యవసాయ సిబ్బంది ఈ–క్రాప్ బుకింగ్ వివరాలను ప్రతి ఆర్బీకేలో సోషల్ ఆడిట్‌కు మూడు రోజుల పాటు అందుబాటులో ఉంచాలని ఏవో జి.మీరయ్య ఆదేశించారు. అలాగే ప్రతి వీఏఏ తమ పరిధిలో గ్రామ సభ నిర్వహించాలని చెప్పారు.

మహిళలకు న్యాయం చేసే వరకు పోరాటాలు



రేపల్లె: బాధిత మహిళలకు న్యాయం జరగటంతో పాటు మోసగించిన ఆర్పీలపై చర్యలు తీసుకునే వరకు పోరాటాలు చేస్తూనే ఉంటామని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. మహిళలను మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక మెప్మా కార్యాలయ ఆవరణంలో సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నిరసన నిర్వహించారు. నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళల సర్టిఫికెట్‌లతో వారికి తెలియకుండా బ్యాంకుల నుంచి రుణాలు పొందిన ఆర్పీలపై రోజులు గడుస్తున్నా చర్యలు తీసుకోకపోవటం తగదన్నారు. ఉన్నతాధికారులు ఈ అంశంపై చర్యలు తీసుకునే వరకు తమ ఉద్యమాలు విరమించేదిలేదని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ధర్మరాజు, గోపి, శ్రీనివాసరావు, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ

అమర్తలూరు(వేమూరు): పోలీసులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ అన్నారు. అమర్తలూరు పోలీసు స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. జూదరులపై ప్రత్యేక నిఘాలు ఉంచాలని చెప్పారు. దసరా, దీపావళి పండగలు వస్తున్న నేపథ్యంలో ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. చుండూరు సీఐ రాజమోహన్, ఎస్ఐ పి.సురేష్ ఉన్నారు.

770 గ్రాముల శిశువును బతికించారు..

గుంటూరు మెడికల్: ఆరున్నర నెలలకే ప్రసవమై 770 గ్రాముల బరువు ఉన్న ఆడ శిశువును అత్యాధునిక వైద్య పరికరాలతో మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు నియోనాటలజిస్ట్ డాక్టర్ దేవభక్తుని రాకేష్‌బాబు చెప్పారు. సోమవారం స్థానిక బృందావన్‌గార్డెన్స్ 7వ లైనులోని ఆయుష్మాన్ తల్లీపిల్లల హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలోని తెనాలికి చెందిన మమత గర్భం దాల్చిన ఆరున్నరనెలలకే ప్రసవం జరిగి ఆగస్టు 5న శిశువుతో తమ ఆస్పత్రికి వచ్చిందని చెప్పారు. అత్యాధునిక వైద్య పరికరాలతో 70 రోజుల పాటు చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పసికందు బరువు 1500 గ్రాములకు చేరిందన్నారు. శిశువు ఆరోగ్యంగా ఉండటంతో సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు డాక్టర్ ప్రియాంక వెల్లడించారు.

అన్నపూర్ణాదేవి నమోస్తుతే..



ఇసుకపల్లిలో అన్నపూర్ణాదేవిగా భ్రమరాంబ దర్శనం



అన్నపూర్ణాదేవిగా బండ్లమ్మ దర్శనం



చినపరిమిలో అన్నపూర్ణాదేవిగా గంగాపార్వతీ దేవి



వెల్లటూరులో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ



లలితా సహస్ర నామ పారాయణం చేస్తున్న మహిళలు

- వైభవంగా దసరా మహోత్సవాలు
- గాయత్రీ, అన్నపూర్ణలుగా దర్శనమిచ్చిన అమ్మవార్లు

రేపల్లె రూరల్: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు పట్టణంలోని వివిధ దేవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఓల్డ్ టౌన్‌లోని గ్రామ దేవత బూరుగలమ్మ గాయత్రీ దేవిగా, ఇసుక పల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో భ్రమరాంబ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పేటేరులోని గ్రామ దేవత మహాలక్ష్మి గుండెపాటెమ్మ బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఆయా దేవాలయాలలో అర్చకులు అమ్మవార్లకు ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాలలో అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వెంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయంలో సోమవారం అన్నపూర్ణాదేవిగా బండ్లమ్మ అమ్మవారిని అలంకరణగావించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు బుద్దా వెంకటలక్ష్మి, ఈఓ జి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

అన్నపూర్ణా దేవిగా గంగాపార్వతీ దేవి

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమి శ్రీ గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో పార్వతీ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను మామిళ్లపల్లి శ్రీనివాసరావు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు

భట్టిప్రోలు: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా భట్టిప్రోలు హిందూ శ్మశాన వాటికలో కొలువైన గుండి పార్వతీ అమ్మవారు సోమవారం శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కార్యక్రమాలను యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. స్థానిక పార్వతీ థియేటర్ వద్ద కనకదుర్గమ్మ అమ్మవారికి గుంజా సుధాకర్ దంపతులు పూజలు నిర్వహించారు. వెల్లటూరులో అశ్వథ్ నారాయణ మహాలక్ష్మి దేవతా వన వృక్షం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక లాక్ సెంటర్‌లోని శ్రీ కనకదుర్గా మహంకాళి నాగేంద్రస్వామి దేవాలయంలో అమ్మవారు శ్రీ గాయత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భట్టిప్రోలు కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీ దేవి, పార్వతీ అమ్మవారు రుద్రశక్తి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భట్టిప్రోలులో భ్రమరాంబ మల్లేశ్వరస్వామి, హేమ విఠలేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, రాజ్యలక్ష్మి సమేత విఠలేశ్వరస్వామి, దండిపార్వతీ అమ్మవారు, ఐలవరంలో కామాక్షి దేవి చంద్రమౌళేశ్వర స్వామి, అనంత నాగేంద్రస్వామి దేవస్థానం, పెదపులివర్రు గోగులమ్మ, వెల్లటూరులో బాలా త్రిపురసుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి, వేమవరంలో రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి దేవాలయాలలో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక నాయి బ్రాహ్మణ వీధి, భోగేశ్వర పేట, హనుమాన్ పేటలో కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.

శ్రీ లలిత త్రిపుర సుందరిగా దుర్గమ్మ

కర్లపాలెం: శరన్నవరాత్రులలో భాగంగా పెద్దింటమ్మ ఆలయంలో సోమవారం దుర్గమ్మకు శ్రీ లలితా త్రిపుర సుందరీ అలంకరణగావించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

దసరా మహోత్సవాలు

మోదుకూరు(వేమూరు): చుండూరు మండలంలోని మోదుకూరి గ్రామంలోని శ్రీ కనకదుర్గాంబ సమేత రామ చౌడేశ్వరి దేవాస్థానంలో సోమవారం అన్నపూర్ణ అలంకారణ చేశారు. అర్చకులు మామిళ్ల నాగేశ్వరశర్మ పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు

బాపట్ల అర్బన్: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీగంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన మండపంలో ఎమ్మెల్యే కోన రఘుపతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, పార్టీ నాయకులు వెదురుపర్తి లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లలిత త్రిపుర సుందరిగా..

పిట్టలవానిపాలెం: అల్లూరు శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో లలిత త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. జీఎస్‌పాలెం శివారు శ్రీనివాసపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం, పోతనకట్టవారిపాలెం శివారు పుచ్చకుర్తివారిపాలెంలో వేడుకలు జరిగాయి.



లలితా త్రిపుర సుందరిగా దుర్గమ్మ



అన్నపూర్ణగా కనకదుర్గమ్మ



దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



సోమేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే కోన రఘుపతి పూజలు

స్పందనకు ఆరు అర్జీలు

రేపల్లె రూరల్: స్పందన కార్యక్రమానికి ఆరు అర్జీలు అందినట్లు ఆర్డీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ విజయేంద్ర తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన అర్జీలు స్వీకరించి మాట్లాడారు. అడంగల్ మంజూరుకు 1, నేషనల్ హైవే ఏర్పాటుతో స్థలాన్ని కోల్పోయిన తమకు పరిహారం అందించాలని 2, రేషన్ కార్డుకు 1, పింఛను 1, యాభై సంవత్సరాలు నిండిన మాలలకు పింఛను ఇవ్వాలని 1, మొత్తం ఆరు అర్జీలు అందాయన్నారు. అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

చేపల పెంపకంపై అవగాహన

జంపని(వేమూరు): చేపలకు వ్యాధులు సోకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మత్స్యశాఖ సహాయకురాలు కె.రత్న మాధురి అన్నారు. జంపని గ్రామంలో నాలుగో విడత మత్స్య సాగు బడి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జంపని ఫిషర్ మేన్ సంఘ సభ్యులకు చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. చెరువులో చేపలను ప్రతి రోజు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి ఎఫ్‌డీఓ జె.మహిజ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మాదిగల ప్రాంతీయ సదస్సు జయప్రదం చేయాలి

రేపల్లె: మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని, ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు జూలగంటి బుజ్జిబాబు కోరారు. ఈ నెల 20న గుంటూరులో జరగనున్న ప్రాంతీయ సదస్సు కర పత్రాలను సోమవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆవిష్కరించారు. సదస్సును మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. నాయకులు దున్న రాబర్ట్, నాగేశ్వరరావు, కోనా శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, సందీప్, నాగరాజు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి కేసు నమోదు

తెనాలిరూరల్: అనుమానాస్పద మృతి కింద కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ చినరావూరుకు చెందిన వ్యాపారి షట్టి పుల్లారావు ఇటీవల మృతి చెందారు. దహన సంస్కారాలూ పూర్తయ్యాయి. ఆయన మృతిపై అనుమానాలున్నాయంటూ బంధువులు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ సీఐ కె. చంద్రశేఖర్ తెలిపారు. అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉంటారని ప్రాథమికంగా భావిస్తున్నట్టు చెప్పారు. దర్యాప్తులో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు.

ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు



తుమ్మలపల్లి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘుపతి



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీ మోపిదేవి



అడవులదీవిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మోపిదేవి హరనాథబాబు

ఎమ్మెల్యే కోన రఘుపతి

తుమ్మలపల్లి(కర్లపాలెం): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలతో ప్రభుత్వం ప్రజలందరికీ వైద్య సేవలందిస్తోందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. తుమ్మలపల్లి గ్రామంలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి, పౌష్టికాహారం రుచి చూశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలందరికీ ఉచితంగా కార్పొరేట్‌స్థాయి వైద్య సేవలందిస్తూ, నాణ్యమైన మందులు అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దబ్బుకూటి ఏడుకొండలు, కాగిత కరుణకుమారి, ఎంపీటీసీలు పులుగు సుబ్బారెడ్డి, ఆసిఫ్ అలీ, యారం వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు ఆరోగ్య రక్ష

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్య రక్ష కల్పిస్తోందని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని 8, 10 వార్డుల ప్రజలకు ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూలులో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. మెడికల్ క్యాంప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 680 మందికి వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, కౌన్సిలర్‌లు, కార్పొరేషన్‌ల డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్డికాయలంకలో 320 మందికి..

రేపల్లె రూరల్: మండలంలోని గుడ్డికాయలంక ప్రాథమిక పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మోళ్లగుంట పీహెచ్‌సీ వైద్యులు 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉయ్యూరు శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. బేతపూడి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివపార్వతి తెలిపారు.

618 మందికి వైద్య పరీక్షలు

నగరం: మండలంలోని పెద్దవరంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సైదానాయక్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్య శిబిరంలో 618 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 47 మందిని మెరుగైన వైద్య సేవలకు రిఫర్ చేసినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీను, డాక్టర్లు దుర్గాప్రసాద్, నజీలా పర్వీన్, సీహెచ్‌వో బాబురావు, వైఎస్సార్ సీపీ నాయకులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యం..

నిజాంపట్నం: ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి హరనాథబాబు అన్నారు. అడవులదీవి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు 650 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, బలరాం, ముక్తేశ్వరరావు, పరమేశ్వరరావు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహా భాగ్యం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

పెనుమర్రు(వేమూరు): ఆరోగ్యమే మహా భాగ్యమని నమ్మి, ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని పెనుమర్రు గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత విద్య, వైద్యానికి ప్రాధాన్యమిచ్చారని మంత్రి మేరుగ అన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేమన్నారు. వైద్యులు డాక్టరు జి.వెంకట సురేష్, డాక్టరు రవళి, డాక్టరు కోటేశ్వరి, డాక్టరు వెంకటేష్ నాయక్, గ్రామ సర్పంచ్ కొక్కిలగడ్డ సుమతి, పిల్లి సామ్రాజ్యం, జెడ్పీటీసీ గాజుల హేమలత, బొల్లిముంత ఏడుకొండలు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సిద్దెల రాజకిషోర్, మన్నె సారధి పాల్గొన్నారు.



పెనుమర్రులో సురక్ష కిట్ అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

బాపట్ల అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని వివేకానంద కాలనీలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. రోగులకు అందిస్తున్న మందులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, జోగి రాజా, షేక్.సయ్యద్ పీర్, ముదుగు అక్కిరెడ్డి, నర్రా వెంకట్రావు, కొక్కిలిగడ్డ చెంచయ్య పాల్గొన్నారు.

ఇజ్రాయెల్‌లో శాంతి నెలకొనాలి

- సామాజిక సేవలో నిమగ్నమవుతా
- ఇజ్రాయెల్ యువతి అరవ



తెనాలి: 'ఇజ్రాయెల్‌లో అకస్మికంగా ఆరంభమైన యుద్ధం భయాందోళన కలిగిస్తోంది...త్వరగా ముగిసి శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తున్నా..వెనువెంటనే వెళ్లి అక్కడ సామాజిక సేవలో నిమగ్నం కావాలని కోరుకుంటున్నాం..' ఇజ్రాయెల్ యువతి అరవ అన్నారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలోని యూదులు (బెనె ఎఫ్రాయిమ్ కమ్యూనిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్)ను కలిసేందుకు ఆమె వచ్చారు. యూదుల అతి ముఖ్యమైన పండుగల్లో ఒకటైన పర్ణశాలల పండుగను ఇక్కడి వారితో కలిసి జరుపుకున్నారు. చివరిరోజు 'సింహాత్వర' (ధర్మశాస్త్రం నందు ఆనందించటం) వేడుకకు అంతా ఏర్పాట్లు చేస్తుండగా గాజా స్ట్రిప్ నుంచి హమాస్ మిలిటెంట్లు రాకెట్ దాడులు చేయటం, సరిహద్దుల్నుంచి అక్రమంగా లోనికి ప్రవేశించటంతో ఇజ్రాయెల్ దేశం స్టేట్ ఆఫ్ వార్‌ను ప్రకటించటం వెనువెంటనే జరిగాయి. కొత్తరెడ్డిపాలెంలోని యూదుల ప్రార్థన మందిరం 'బెనె యాకోబ్ సునగోగు'లో ఉన్న అరవకు ఈ పరిణామాలు కలవరం కలిగించాయి. స్వదేశంలో ఉన్న తల్లిదండ్రులు ఎలాగున్నారో? అనే భయాందోళనలు ముప్పిరిగొన్నాయి. హమాస్ రాకెట్ దాడుల వెంటనే ఇజ్రాయెల్ ప్రభుత్వం హెచ్చరించినట్లు ఇజ్రాయెల్ పౌరులు చాలా మంది రక్షణ కోసం సిద్ధం చేసుకున్న బంకర్లలోకి వెళ్లిపోయారు. ఫలితంగా కొన్ని గంటల తర్వాతనే అరవ, తల్లిదండ్రులతో ఫోనులో మాట్లాడగలిగారు. వారు క్షేమంగా ఉన్నారని తెలిశాకనే మనసు కుదుటపడినట్లు ఆదివారం 'సాక్షి'తో చెప్పారు.

ఇజ్రాయెల్‌కు చెందిన అరవ హైస్కూలు తర్వాత ఒకటిన్నర సంవత్సరం కాలేజి చదువు పూర్తిచేశారు. అక్కడి ప్రభుత్వ పాలసీ ప్రకారం ప్రతి ఒక్కరూ సైన్యంలో పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. ఆ క్రమంలోనే రెండేళ్లపాటు సైన్యంలో పనిచేశారు. 'సైనికులు ఎవరైనా గాయపడితే వారికి వైద్య చికిత్స చేయించటం వారిని కనిపెట్టుకుని ఉండటం వంటి బాధ్యతలను నిర్వర్తించాను' అని చెప్పారు. ఆర్మీలో పనిచేసిన యువతీ యువకులు కోరుకున్న దేశాన్ని సందర్శించి రావటానికి ఇజ్రాయెల్ దేశం అనుమతిస్తుంది. ఆ క్రమంలో భారతదేశం సందర్శనను కోరుకుందా యువతి. మూడు నెలల కిందట మన దేశంలోకి అడుగుపెట్టారు. అందమైన కశ్మీర్, లదాఖ్, ధర్మశాల, నేపాల్‌ను దర్శించుకుని, కొద్దిరోజుల క్రితమే కొత్తరెడ్డిపాలెం చేరుకున్నారు. 'భారతదేశం గురించి నేను ఎంతో విన్నాను...ఇక్కడి ప్రజలు మంచివారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దారు కేశవనారాయణరావు



మాట్లాడుతున్న వేమూరు ఏఎంసీ చైర్ పర్సన్ శిరీష

కర్లపాలెం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తహసీల్దారు కేశవ నారాయణరావు అన్నారు. సోమవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో బాలల భద్రతే.. భారత భద్రత కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలు కర్లపాలెంలో ర్యాలీ నిర్వహించారు. అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలని తహసీల్దారు కేశవ నారాయణరావు చెప్పారు. ఏపీఎం శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక సమస్యలు, అధిక సంతానం, అభద్రతా భావం వల్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. వీటిని నిరోధించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మందపాటి పరమానంద కుమార్, సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, పేరాల వెంకట సురేష్, వైఎస్సార్ క్రాంతి పథం సీసీలు పూర్ణచంద్రరావు, శివకోటేశ్వరరావు, సోమేశ్వరి, వీవోఏలు పాల్గొన్నారు.

మహిళ పాత్ర కీలకం

కొల్లూరు: బాల్య వివాహాలను అరికట్టే విషయంలో మహిళల పాత్ర కీలకమని వేమూరు ఏఎంసీ చైర్ పర్సన్ శిరీష అన్నారు. సోమవారం కొల్లూరు మదర్ థెరిస్సా మండల సమాఖ్య కార్యాలయంలో బాల్య వివాహ రహిత భారతదేశం, బాలల భద్రతే–భారత్ భద్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్షత లేకుండా, ఆడ, మగ పిల్లలను సమానంగా చూడాలన్నారు. బాల్య వివాహ రహిత ప్రతిజ్ఞ చేశారు. సమాఖ్య అధ్యక్షురాలు చొప్పర సరళ, ఏపీఎం రాము పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



రేపల్లె రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లికి చెందిన పలువురు ఎస్సీ సంఘ నాయకులు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణంలోని తన కార్యాలయంలో మోపిదేవి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచిఅమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ సంఘం ఉపాధ్యక్షుడు తలపల సాంబయ్య, బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు గుస్సం దుర్గారావు, నాయకులు ప్రేమ్‌కుమార్, హరితో పాటు పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు తదితరులున్నారు.